క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

గంగవరం: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆదివారం పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్ తెలిపారు. కొత్తాడలోని రైతు భరోసా కేంద్రంలో ఉదయం 11 గంటలకు రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి సూరంపూడి ఏడుకొండలు స్వగృహంలో జరిగే వివాహ వేడుకలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి మోహనాపురం పంచాయతీలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది , పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రాయితీపై ట్రాక్టర్లు

గూడెంకొత్తవీధి: డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద మండలానికి ప్రభుత్వం రాయితీపై ట్రాక్టర్లను మంజూరు చేసిందని మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు తెలిపారు. మండలంలో సంకాడ, పెదవలస, దేవరాపల్లి, వంచుల, దారకొండ రింతాడ ఆర్‌బీకేల పరిధిలో మంజూరైన ట్రాక్టర్లను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు శనివారం ప్రారంభించినట్టు వ్యవసాయాధికారి పేర్కొన్నారు.

సర్పంచ్ పుష్పలమ్మకు ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ



సర్పంచ్ పుష్పలమ్మను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పాడేరు రూరల్: బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న హుకుంపేట మండలం బూరమాసి పంచాయతీ సర్పంచ్ పుష్పలమ్మను శనివారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ కె.కృష్ణారావును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని, అత్యవసరమైతే ఉన్నత వైద్య చికిత్సల కోసం విశాఖపట్నం తరలించాలని డాక్టర్ కృష్ణారావుకు ఎమ్మెల్యే పాల్గుణ సూచించారు. పరామర్శించిన వారిలో పెదబయలు జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, నాయకులు, తదితరులున్నారు.

ఎంపీపీ పరామర్శ



ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మను పరామర్శిస్తున్న ఎంపీపీ రమేష్ తదితరులు

కొయ్యూరు: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజుల్మమను శనివారం ఎంపీపీ బడుగు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు పరామర్శించారు. తీవ్ర గాయాలు కావడంతో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అసవరమైతే మెరుగైన వైద్యం కోసం మైదాన ప్రాంతానికి తరలిస్తామని రాజుల్మమకు తెలిపారు. ఆమెకు ధైర్యం చెప్పారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



సైకిల్ తొక్కుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రపంచ సైకిల్ దినోత్సవ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డి.రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని , ఆరోగ్య సూత్రాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో సైకిల్ తొక్కుతూ ర్యాలీ నిర్వహించారు.

గిరిజన ప్రాంతాభివృద్ధికి ప్రాధాన్యం



ఉప్పలో గ్రామస్తులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు శామ్యూల్ తదితరులు



చెరకుంపాలెంలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- గడప గడపకు విశేష ప్రజాదరణ
- ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మిలకు ఘన స్వాగతం

హుకుంపేట: గిరిజన ప్రాంతాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారని, శివారు గ్రామాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండలంలోని మత్స్యపురం పంచాయతీ ఉప్ప, బైరోడివలస, దిగ గరువు, చెరువుచింత గ్రామాల్లోని శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 157 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతోందన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందన్నారు. మన్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, సొసైటీ బ్యాంకు చైర్మన్ రామకృష్ణ, సర్పంచ్‌లు సింహాచలం, అప్పలనాయుడు, సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు కిల్లో మీనా, మండల పార్టీ యువజన విభాగ కార్యదర్శి కోరాబు వెంకట్, నాయకులు ధర్మయ్యదొర, వెంకట్, సూరిబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం

రాజవొమ్మంగి: ప్రజా సమస్యలు పరిష్కారానికి జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చెప్పారు. మండలంలోని చెరుకుంపాలెం పంచాయతీలో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది.

కార్యక్రమంలో భాగంగా మండుటెండను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి గ్రామంలో 250 గడపలను సందర్శించారు. ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వెలుగు చూస్తున్న అనేక ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం అధిక ప్రాధాన్యతినిస్తోందన్నారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌రాజు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

8న సీఆర్టీల సమావేశం

రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్టీలకు ఈ నెల 8న స్థానిక సాయినగర్‌లో సమావేశం నిర్వహించనున్నట్టు సీఆర్టీల జిల్లా అధ్యక్షుడు సారపు కృష్ణమూర్తి దొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పలు సమస్యలు గురించి చర్చించి తీర్మానాలు చేసి ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు పేర్కొన్నారు. సమావేశానికి ప్రతి సీఆర్టీ హాజరుకావలని ఆయన కోరారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



అనంతగిరిలో కురుస్తున్న వర్షం

అనంతగిరి: మండల కేంద్రంలోని ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంది. మధ్యాహ్నం ఒక్కసారి వాతావరణం మార్పుచోటుచేసుకుని చల్లబడింది. సుమారు గంట పాటుగా ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఎండతీవ్రతకు ఉక్కిరిబిక్కిరైనా మండలవాసులు మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. ఈదురుగాలులకు అక్కడకక్కడ చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. కొద్దిరోజులుగా ఎండతీవ్రత అధికంగా ఉండడంతో మండలవాసులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. వేడిగాలులతో ఉక్కపోత కారణంగా వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం గంట పాటు కురిసిన భారీ వర్షంతో వాతావరణం చల్లబడడంతో పాటుగా పంట పొలాలకు వర్షపునీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు

రాజవొమ్మంగి: మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులను వ్యాప్తి చేసే కీటకాలు, దోమలను సమూలంగా అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములవుదామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన మలేరియా వ్యతిరేక మాసోత్సవం, జాతీయ కీటకజనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా అధికారులతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న దోమతెరలు వినియోగించి, దోమకాటు నుంచి తమను తాము కాపాడుకోవాలని కోరారు. కాలువల్లో మురుగు నీరు, పూడికతీత లేకుండా పంచాయతీ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.అనంతరం దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తు వారపు సంతలో భారీ ర్యాలీ జరిగింది. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ, ఎంపీడీఓ బాపన్నదొర, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మలేరియాసబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, పీహెచ్‌సీ స్టాఫ్ పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో సబ్‌కలెక్టర్ సందర్శన

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు పునరవాస కాలనీలను రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభంభన్సాల్ శనివారం సందర్శించారు. ఇందుకూరు-1, 2 కాలనీలను సందర్శించి నిర్వాసితుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు కాలనీల్లో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, పారిశుధ్యం మెరుగుపరచాలని కోరారు. తహసీల్దార్ రామకృష్ణ తదితరులున్నారు.

విద్యార్థులకు కథల పోటీలు

దుంబ్రిగుడ: మండలంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం కథల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారి శెట్టి సునీత మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని, త్వరలో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్న చెట్టి వికాస్

అనంతగిరి: జీనబాడు పంచాయతీ పెదగంగవరంలో ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చెట్టి వికాస్, సర్పంచ్ సలుగు మాధవి భక్తులతో కలిసి ఆలయ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెట్టి వికాస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు రూ.5వేలు అందించారు. అనంతరం చెట్టి వికాస్‌ను గ్రామస్తులు, కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. ఉపాధ్యాయులు ఈశ్వరరావు, దేముడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర్యనారాయణ, గంగునాయుడు, మండల కో-కన్వీనర్ రాజారావు, వలంటీర్ వరహాలదొర తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి నడియాడిన ప్రాంతాలభివృద్ధి చేస్తాం

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నడియాడిన ఏఎల్‌పురం(కృష్ణదేవిపేట) గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, దీని కోసం ప్రణాళిక రూపొందించామని అనకాపల్లి ఎంపీ బి.వి. సత్యవతి తెలిపారు. మండలంలోని ఏఎల్‌పురం (కృష్ణదేవిపేట) ఎస్సీ కాలనీలో ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని శనివారం ఆమె నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీ నిధులతో ఈ ప్రాంతంలో కమ్యూనిటీ భవనాలతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అల్లూరి నడియాడిన ప్రాంతాల అభివృద్ధి చేస్తామన్నారు. ఏఎల్‌పురంలో పంచాయతీ, మండల పరిషత్, జెడ్పీ, ఎంపీ నిధులతోపాటు ఇతర నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు ఇటీవల కలెక్టర్‌తో చర్చించామన్నారు. ప్రధానంగా ఈ గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానన్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, ప్రధాన రోడ్లు, అల్లూరి పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ లోచల సుజాత, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, నర్సీపట్నం పీఆర్‌డీఈఈ ప్రసాద్, తహసీల్దార్ ఆనందరావు, ఎంపీడీవో డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతికి సంతాపం

అనంతగిరి: మండలంలోని పెదబిడ్డ పంచాయతీ చిమిటి గ్రామానికి చెందిన, సిరగం రాంనాయుడు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంటివద్దనే ఉంటున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మండలంలోని పార్టీ బలోపేతానికి కృషి చేసిన రాంనాయుడు మృతి పార్టీకి తీరనిలోటుగా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి నాయకులు నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణి రాంనాయుడు మృతిపై సంతాపం తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి రేకుల వితరణ



అంగన్‌వాడీ కేంద్రానికి పైకప్పు రేకులు అందజేస్తున్న దాత జమాల్‌ఖాన్

చింతూరు: మండలంలోని పావుర్లంకలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ శనివారం రేకులను వితరణగా అందజేశారు. జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25 వేల విలువైన రేకులను కేంద్రానికి అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న చింతూరు సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ పాకలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం దుస్థితిని దాత జమాల్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే స్పందించిన ఆయన కేంద్రానికి పైకప్పు రేకులను సమకూర్చారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చూడాలని ఆయన సూచించారు. ఎస్ఐ శ్రీనివాసరావు, ట్రస్ట్ ప్రతినిధి ఇమ్రాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జీవకళ

- చురుగ్గా చెరువు పనులు
- ఆనందంలో గిరిజన రైతులు



బొండుగుడలో అభివృద్ధి చేయనున్న చెరువు

అరకులోయ రూరల్: చెరువుల తవ్వకాలతో గిరిజన రైతులకు పుష్కలంగా సాగునీరు సౌకర్యం అందుబాటులోకి రానుంది. మండలంలో పద్మాపురం, చినలబుడు, మాడగడ పంచాయతీల పరిధిలో దుమగుడ, పద్మాపురం, మాలిసింగరం, నందిగుడ గ్రామల్లోని చెరువుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అమృత సరోవర్ ప్రాజెక్టులో భాగంగా చెరువుల తవ్వకాలు జరుగుతున్నాయి. గిరిజన రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ఒక్కో చెరువుకు రూ.35లక్షలను నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా చెరువుల అభివృద్ధి అనే బృహత్తర కార్యక్రమం జరుగుతుండడంతో గిరిజన రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

1200 ఎకరాలకు సాగునీరు

చెరువు పనులు పూర్తయితే మండలంలోని సుమారు 60 గ్రామలకు సంబంధించి 900 మంది గిరిజన రైతుల పంట భూములకు సాగునీరు పుష్కలంగా అందుతుంది. గతంలో టీడీపీ హయంలో సాగునీటి కోసం రైతులు పలుమార్లు పాలకులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. దీంతో సాగు కోసం గిరిజన రైతులు నానా అవస్థలు పడ్డారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వ్యవసాయరంగానికి పెద్దపీట వేసింది. రైతుల కోసం పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందిస్తోంది. దీంతో పాటు సాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రతి గ్రామంలో చెరువుల అభివృద్ధి పనులు చేపడుతోంది. వర్షాకాలంలో నీరు వృథా కాకుండా చెరువుల్లో సంవృద్ధిగా ఉండేలా పనులు చేపడుతోంది. ఫలితంగా సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంది.

రుణపడి ఉంటాం



చెరువులు అభివృద్ధి చేస్తే మరింతగా సాగు చేసే అవకాశం ఉంటుంది. వేసవిలో కూడా కూరగాయలు రెండో పంట వరి ఇతర పంటలు పండించేందుకు ఉయోగపడుతుంది. చెరువుల అభివృద్ధితో మెట్టు భూములు అంత సాగుబడిలోకి వస్తాయి. వ్యవసాయరంగానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తు రైతులకు అన్ని రకల సౌకర్యాలు కల్పిస్తుంది. రైతులను ఆదుకుంటున్న జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– రఘు, రైతు, చినలబుడు పంచాయతీ

సాగునీరు అందించడమే లక్ష్యం



మండల పరిధిలో ఉన్న 14 గ్రామ పంచాయతీల్లో రైతులకు అవసరమైన చోట చెరువు అభివృద్ధి పనులు చేయిస్తాం. ప్రతి రైతు భూములో సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చోరవ తీసుకుంది. విడతల వారీగా అన్ని గ్రామల్లో చెరువు నిర్మాణం పనులు చేపడతాం. పాత చెరువులు అభివృద్ధి చేయడమే కాకుండా కొత్త చెరువులు కూడా ఉపాధి హమీ పథకం ద్వారా చేపడతున్నాం. వేతనదారులకు గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తున్నాం.

– నగేష్, ఎంపీడీవో, అరకులోయ మండలం

ప్రజా సంక్షేమ వారధులు వలంటీర్లు



రాజవొమ్మంగిలో వలంటీర్లను సన్మానిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: ప్రజా సంక్షేమానికి గ్రామ వలంటీర్లే వారధులు అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా 241 మంది వలంటీర్లు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకోగా, వారిలో ఐదుగురికి సేవారత్నం, మిగిలిన 236 మందికి ఉత్తమ సేవా మిత్ర పురస్కారాలను ఎమ్మెల్యే ధనలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్దిదారుల చెంతకే చేరుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలన్నీ జన్మభూమి కమిటీలకే సొంతమయ్యేవని, ప్రజలకు దక్కేవి కావని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా పారదర్శకంగా అందరికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు.

జగనన్న అమలుపరస్తున్న సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల నియామకం ఎన్నో సత్ఫలితాలను ఇస్తోందన్నారు. వలంటీర్ల నిస్వార్థ సేవలను గుర్తించి ప్రభుత్వం పురస్కారాలను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా రాజవొమ్మంగి సచివాలయం-1కు చెందిన గ్రామ వలంటీర్ జ్యోతి మాట్లాడుతూ వంటంటికీ పరిమితమైన తన లాంటి వారెందరికో ఉపాధి కల్పించి, జీవితానిచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికి ఎళ్లవేళలా రుణపడి ఉంటామన్నారు. థ్యాంక్యూ సీఎం జగన్ సార్ అంటూ శాల్యూట్ తెలిపారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్, సొసైటీ చైర్మన్ రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌రాజు, జెడ్పీటీసీ జ్యోతి, వైస్ ఎంపీపీ చంద్రరాణి, సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు మురళీకృష్ణ, కో-ఆప్షన్‌మెంబర్ కామేష్, ఎంపీడీఓ బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



అర్లడలో గిరిజనులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, నేతలు

హుకుంపేట: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, గిరిజనుల కష్ట నష్టాల్లో అండగా ఉంటామని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని శోభకోట పంచాయతీ అర్లడ గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన శనివారం పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను తెలియజేయగా, త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరిజనులకు నిత్యం అందుబాటులో ఉంటామని తెలిపారు. యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా శనివారం వడగాల్పులు వీచాయి. ఉక్కపోతతో స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. రాత్రి 8.30 దాటినా వేడిగాలులు వీడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులు గమ్య స్థానాలు చేరేందుకు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. ఎండ వేడిమి, ఉక్కపోతకు వృద్ధులు, చిన్నారులు ఆపసోపాలు పడ్డారు. మూగజీవాలు అల్లాడిపోయాయి. శీతలపానీయాల విక్రయాలు జోరుగా సాగాయి.